సరదాపడకండి. మహావిష్ణువు శరీరం ధరించినా తిప్పలు తప్పవు. రాముడు కూడా మాటలు అనిపించుకొన్నాడు. దేహం ధరించటం వలన వచ్చే ప్రమాదం చెపుతున్నాను. మీరు మోక్షాన్ని కోరుకోండి అంతేగాని మంచి జన్మలు కావాలని కోరుకోవద్దు. జన్మ వస్తే మనిషి కూడా నీడ వచ్చినట్లుగా దుఃఖం వచ్చేస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-06, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం సబ్జక్టును అధ్యయనం చేసి, అర్థం చేసుకొని దానిని ఆచరిస్తే అది మనకు అనుభవంలోనికి వస్తుంది. దీనికి గురువు అనుగ్రహం ఉండాలి. శ్రద్ధ ఉన్నవాడికి సందేహాలు తగ్గుతూ ఉంటాయి. శ్రద్ధ లేకపోతే సందేహాలు ఎక్కువవుతాయి. ప్రతీ మనిషి నేను, నేను అంటాడు. ఆనేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు రామకృష్ణుడు. ఇది చిరకాలం, కలకాలం గుర్తుపెట్టుకోవలసిన మాట. లోపల అజ్ఞానం ఉన్నవాడికి దుఃఖం , అజ్ఞానం లేనివాడికి ఎటుచూసినా దుఃఖం కనబడదు. ఈ శరీరమే నేను అని అజ్ఞాని ఎంత స్పష్టంగా అనుకొంటాడో అంత స్పష్టంగా జ్ఞానికి చైతన్యంతో తాదాత్మ్యం ఉంటుంది. మీరు ఎక్కడ ఉన్నారు అనేది ముఖ్యం కాదు, గురువుతో మానసికఅనుబంధం ఉండాలి. మానసిక అనుబంధం వలన గురువు యొక్క దయకు పాత్రులవుతాము, అప్పుడు మనస్సు పవిత్రం అవుతుంది. గురువు చూపులు, మాటలు దయాపూరితమే. దేవుడు అంటే ఉండటమే అన్నారు భగవాన్. మనకు ఎప్పుడూ ఉండాలని ఉంది. ఎవరికి చనిపోవాలని లేదు, ఆ ఉండటమే దేవుడు. మీరు ఎలా ఉన్నారు అంటే మేము ముసలివారం అయిపోయాము, మేము పిల్లకాయలం అంటారు. నేను ఉన్నాను అంటే ఆ ఉండే వస్తువుకు వయస్సు లేదు, గుణం లేదు, రూపం లేదు, నామం లేదు, అది లేదా అంటే ఉంది, అది దాని యొక్క వైభవం.

మనంకాని మనస్సుతోటి, మనంకాని విషయంతోటి, మనంకాని గుణాలతోటి తాదాత్మ్యం పొందటం వలన డిప్రెషన్ వస్తోంది, ఎమోషన్ వస్తోంది. ఇవి అన్నీ మనస్సులో వచ్చే వికారాలు. మనం కానిదానిలో నుండి విడుదల పొందితేనే గాని మనకు జ్ఞానం రాదు. మీకు శరణాగతిభావన కనుక కలిగితే ఇప్పడే మీ అశాంతి అంతా ఆరిపోతుంది.

మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా భగవంతుడి సంకల్పమే. భగవంతుడి సంకల్పాన్ని అర్థం చేసుకొనే శక్తి ఉంటే మీకు అశాంతి లేదు, దుఃఖం లేదు. ప్రారబ్దం ప్రకారం ఈ శరీరం ద్వారా ఏ పనులు జరగాలో ఆ పనులు జరిగిన తరువాత ఈ శరీరం అనే బొంగరం పడిపోతుంది. జీవితంలో మీకు సన్మానాలు, అవమానాలు జరుగుతూ ఉంటాయి, అవి నిజం కాదు. భగవంతుడికి తెలియకుండా ఈ సృష్టిలో ఏమీ జరగటానికి వీలులేదు. అయితే భగవంతుడు వేరు, మనం వేరు అనుకొంటున్నాము కాబట్టి ఆయన సంకల్పాన్ని అంగీకరించలేకపోతున్నాము, అందుచేత అశాంతికి గురి అవుతున్నాము. భగవంతుడు వేరు, నేను వేరు అనే భిన్నభావనలో నుండే మనకు దుఃఖం వస్తోంది. అనుకొనేది జీవసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్దాన్ని అనుసరించి ఆడిస్తాడు. మన చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేయటమే, ఫలితం మన చేతిలో లేదు, ఫలితం ఇచ్చేవాడు ఈశ్వరుడు. కర్త భగవంతుడు ఒక్కడే. ఇతరులు ఎవరూ కర్తలు కాదు అని మనకు అర్థమైతే ఇంక దుఃఖం రాదు. చావులు పుట్టుకలు నిజం కాదు, ఇవి నిజంలాగ నీకు కనిపిస్తున్నాయి కాబట్టి నీకు దుఃఖం వస్తోంది. మీ అశాంతికి ఎవరు కారణం అనుకొంటున్నారో వారి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు. లోపల భగవంతుడు లేకుండా దేహం ఉండటానికి వీలులేదు. మా మావగారు అన్యాయం చేసారు, అత్తగారు అన్యాయం చేసారు, అన్నగారు అన్యాయం చేసారు అని ఇలా తొంభై రకాలుగా అనుకొంటారు. వారు ఎవరు నీకు అన్యాయం చేయటానికి, వారు కర్తలు కాదు, భగవంతుడు ఒక్కడే కర్త, అది నీకు అర్థమైతే దుఃఖం లేదు.

ఏదో మీరు నలుగురు కూర్చోవటం సత్సంగం కాదు, లోపల ఉన్న సత్యపదార్థంతో, భగవంతుడితో, గురువుతో మానసికఅనుబంధం కలిగి ఉంటే మీరు సత్సంగంలో ఉన్నట్లే. కర్మఫలితం శాశ్వతం కాదు. మీరు ఏదో గొప్ప కర్మ చేస్తారు, ఫలితం వస్తుంది. దానిని అనుభవిస్తే అది పోతుంది. పెద్దపెద్ద సామ్రాజ్యాలే కొట్టుకొని పోయినప్పుడు మీరు ఎంత? మీరు చేసిన కర్మ ఎంత? ఫలితం వస్తే ఆ ఫలితం ఎంతకాలంఉంటుంది. మా అబ్బాయి బాగా చూస్తున్నాడు అంటారు. అది ఎంతకాలం ఉంటుంది. మనుషుల ప్రేమలు నిజం కాదు. జీవుడు గుణాలతో కలిసి ఉంటాడు. సత్వగుణం ఉన్నప్పుడు ఒకలాగ ఉంటాడు, తమోగుణం ఉన్నప్పుడు ఒకలాగ ఉంటాడు, రజోగుణం ఉన్నప్పుడు ఒకలాగ ఉంటాడు. ఆ

ప్రేమలను నమ్మటానికి అవకాశం లేదు. నిజంగా ప్రేమించే వాడు ఈశ్వరుడు ఒక్కడే, మనంకాని శరీరంతో, మనంకాని ధనంతో, చదువుతో తాదాత్మ్యం పొంది గర్వం తెచ్చుకొంటున్నాము, ఆ రకంగా అజ్ఞానం ప్రారంభమవుతోంది, ఉన్న సౌందర్యాన్ని పోగొట్టుకొంటున్నాము. మనం ఎక్కువ చదువుకొంటే, మనకు ఎక్కువ సంపద ఉంటే అందరిలాగ మనం ఎందుకు ఉండలేకపోతున్నాము. అక్కడ పిచ్చితనం ప్రారంభమవుతోంది. మన ఇంద్రియాలతోటి, మనస్సుతోటి, బుద్ధితోటి సంపాదించిన విషయాలతో కలిసిపోయి, అవే మనం అనుకొని లేనిపోని వికారాలు తెచ్చుకొంటున్నాము. మనం సంపాదించిన వస్తువులు ఇక్కడే ఉంటాయి కాని మనలో ఉన్న వికారాలు మరణానంతరం మన కూడా వస్తాయి, ఎందుచేతనంటే కర్మ అనుభవించటానికి.

మీకు చదువు ఉన్నా, డబ్బు ఉన్నా నార్మల్‌గా ఉండాలి, సింపుల్‌గా ఉండాలి. జ్ఞానానికి మించిన సంపద లేదు, జ్ఞానాన్ని సంపాదించుకోవటం ముఖ్యం, అదే గమ్యంగా పెట్టుకో. మన హృదయంలో చావులేని సత్యవస్తువు ఉంది. ఉండటం వేరు, వ్యక్తమవ్వటం వేరు. హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు వ్యక్తమవ్వాలి. మనం నేను, నేను అంటాము. ఆ నేను నేను కాదని తెలుసుకొనే వరకు మన హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు వ్యక్తం కాదు అంటే మనకు తెలియబడదు. అది తెలియబడితే మోక్షం, శాంతి. అప్పుడు ఈ దేహం ఉండటానికి, లేకపోవటానికి బేధం పోతుంది. నామరూపాలు అనేవి ఒక పెద్దఅడవి. దుఃఖం అంతా నామరూపముల వలననే వస్తోంది. గురువు అనుగ్రహం లేకుండా ఈ నామరూపముల నుండి బయట పడలేము. మన మనస్సు శుచి అవ్వకుండా ఈ నామరూపములే మనకు అడ్డు వస్తున్నాయి. మనం ఎంతసేపు నామరూపములను చూస్తున్నాము కాని అంతర్యామిగా ఉన్న నారాయణుని చూడలేకపోతున్నాము. నామము, రూపము, క్రియ ఈ మూడింటిని ప్రక్కన పెడితే ఉన్న వాడు నారాయణుడే. మీరు చెడ్డవారు అంటే మీకు కోపం వస్తుంది అంటే మంచిగా ఉండాలని మీరు అనుకొంటున్నారు కాబట్టి కోపం వస్తోంది. ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. కొన్ని అనుభవాలు అయితేగాని మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖం అయితే కాని ఆత్మజ్ఞానం రాదు. అన్ని జ్ఞానాలకు, అన్ని ప్రయత్నాలకు, అన్ని సాధనలకు పరిసమాప్తి ఆత్మజ్ఞానం.

జీవుడికి భోగకాంక్ష ఎక్కువగా ఉంటుంది. భోగ ప్రవృత్తిలో నుండి మనస్సును

మళ్ళించేవాడే గురువు, అది గురువుకే సాధ్యం. కేవలం మన బుద్ధి చాతుర్యం వలన లోపల ఉన్న వస్తువును పొందలేము, మనస్సుతో దానిని తెలుసుకోలేము. మనస్సు ఎక్కడైతే అణిగిందో అక్కడ ఆ వస్తువు మనకు తెలియబడుతుంది. గురువు అనుగ్రహం మనకు అందుతూ ఉంటే నామబుద్ధి, రూపబుద్ధి తగ్గుతూ ఉంటుంది. మనం ఎంతసేపు నామరూపములను పట్టుకొని తిరుగుతూ ఉంటాము. ఈ రూపము మీద కోపం వస్తే ఇంకోరూపం పట్టుకొంటాము. ఇలా రూపముల మధ్య తిరుగుతూ, చివరకు ఏదో రూపం పట్టుకొని చనిపోతారు. రూపము పట్టుకొని ఏడుస్తూ చనిపోయేవారికి మరల రూపం రాక ఏమౌతుంది, అదే పునర్జన్మ. నీకు లోపల ఉన్న సుఖం, శాంతి అందటం లేదు అందుచేత నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తోంది. ఆవుకు ఇంటిలో పచ్చిగడ్డి పెడితే ఇంక అది బయటకు రాదు, పచ్చగడ్డి వేయకపోతే గడ్డి కోసం రోడ్డు మీదకు వచ్చేస్తుంది. అలాగే మీ మనస్సుకు లోపల ఉన్న ఆత్మానందం దొరికితే అది బజారులోనికి రాదు, ఇంక దానికి జపతపములతో పనిలేదు.

ఇప్పుడు మీరు ప్రాపంచిక విషయాలతో ఎంత అనుబంధం పెట్టుకొంటున్నారో గురువుతో అంత అనుబంధం పెట్టుకొంటే మీలో ఉన్న బలహీనతలు అన్నీ ధ్వంసమవుతాయి, మీకు ఉన్న అలవాట్లలో నుండి, కోరికలలో నుండి బయటకు వచ్చేస్తారు, ఈ శరీరం ఉండగానే ముక్తి సుఖాన్ని పొందుతారు. ఏ కారణాల వలన మీ మనస్సు బాహ్యముఖమవుతోందో ఆ కారణాలు గురువు అనుగ్రహం వలన మీకు తెలియకుండానే బయటకు పోతాయి. కారణంపోతే కార్యం పోతుంది. దుఃఖానికి కారణం అజ్ఞానం. అజ్ఞానంపోతే దుఃఖం పోతుంది. పూర్వపుణ్యం లేకపోతే సద్వాక్కు విన్నా మనకు అర్థం కాదు. సాధన అవసరమే కాని అంతమాత్రంచేతనే లోపలఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి రాదు. ఈశ్వరానుగ్రహం లేకపోతే మనం సాధన చేసిన ఆయన స్వరూపం మనకు ఇవ్వడు. ఎంతోకొంత మనపని మనం చేసుకోవాలి, పని దొంగలం అవ్వకూడదు. భారం భగవంతుడి మీద వేయటం నేర్చుకోవాలి, మన చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేయాలి. సజ్జన సాంగత్యం వలన జపతపాలతో సంబంధం లేకుండా నీ దేహాభిమానం తగ్గిపోతుంది. దేహము నేను అనే బుద్ధి వలననే సుఖం, దుఃఖం, వేదన, రోదన ఈ అడవి అంతా వస్తోంది. దేహబుద్ధి నశించినప్పుడు నీలో ఉన్న అశాంతి, దుఃఖం కూడా అప్పటికప్పుడు ఆరిపోతాయి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 06-06-06 | మంగళ | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| 11-06-06 | ఆది | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం |
| 28-06-06 | బుధ | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# నిర్మలమైన మనస్సుకే - నిశ్చల స్థితి కలుగుతుంది

వేదాంతం ప్రకారం వర్జించటం అంటే సంపూర్ణంగా వదిలివేయటం. ఆ పరిత్యాగం వల్లనే నిజమైన విశ్రాంతి దొరుకుతుంది. ఒక మహారాజు రాణితో సత్యాన్వేషణకై అన్ని సంపదలు వదలి కట్టుబట్టతో అడవికి వెళ్ళాడు ఆ రాత్రి రాజుకు బాగా నిద్రపట్టింది. రాణికి కంటిమీద కునుకు లేదు కారణం రాజు అడిగితే మొలలో అవసరానికి దాచుకొన్న వజ్రాల హారం దొంగలు దోచుకొంటారని తెలిపింది. రాజు ఆ నగను ఆవతల పారేసిన రోజు నుంచి ఆమె సుఖంగా నిద్రించింది. మన దేహభారాన్ని మనం మొయ్యటం లేదు అన్నట్లుగా మన దేహాన్ని కుర్చీ మీద విశ్రమింపజెయ్యాలి, నిశ్చలంగా కాసేపు పడుకోనియ్యాలి. మన మనస్సులో ఏ ఆందోళనా రానియ్యకుండా, సమస్త వాంఛ ఆశయాలు, ఊహలు విడిచిపెట్టాలి. అది వర్జించటమంటే మనకు ఉన్న వస్తుజాలాన్ని అంతా భూమి మీదనే ఉండనియ్యాలి, కానీ గుండెలమీద పెట్టుకోకూడు. "మనస్సు మీద నిఘా పెట్టగలిగినవాడే మేథావి" అంటారు. ఎవరైనా మరణించారు అనుకోండి అందులో అసహజమైనది ఏముంది? అలాగే గాలి వీస్తే అసహజత్వం ఏముంది, నది ప్రవహిస్తే నది అని ఒకడు ఆశ్చర్యంగా అంటాడు. అందులో ఏముంది? దానికి తల్లక్రిందులు కావటం దేనికి. పుట్టిన ప్రతీవాడు చనిపోవటానికే పుడతాడు. తరగతిలో ఒక్కొక్క క్లాసు పైకి వెళ్ళటం లేదా? "శ్రద్ధ" పరిపూర్ణానికే ఇది అంతా. మన గోళ్ళను మనం తీసుకోవటం లాంటిదే ఈ దేహ మరణాలు అంటారు పెద్దలు. ఈ నిజాన్ని నమ్మాలి, నమ్మి తీరాలి. పుట్టిన లగాయితు స్మశానానికి వెళ్ళేవరకూ ఎటువంటి అనుభవాలు పొందాలో తల్లి గర్భంలో ఉండగానే నిర్ణమైనదని నమ్మితే మనస్సుకు నిశ్చలస్థితి రాకుండా ఉంటుందా? శ్రీనాన్నగారు "తెలివి యొక్క ప్రయోజనం ఇతరుల మోసాలలో పడకుండా ఉండటానికి మాత్రమే" అన్నారు. కట్టెలు వేసే కొలది అగ్ని ప్రభలుతుంది. చింతపడిన కొద్దీ చింత అధికమౌతుంది. కట్టెలు వెయ్యకపోతే అగ్ని ఆరిపోతుంది. చింతించకపోతే చింత ఆగిపోతుంది. ఆశలేని మనస్సు ప్రకాశించినట్లు పూర్ణచంద్రుడు గాని, పాల సముద్రంగాని లక్ష్మి మొఖంగాని ప్రకాశించదు అంటారు. అరణ్యంలో సీత నిర్మల తటాకాన్ని చూచి ఆనందపడితే రాముడు అంటాడు "ఔను సత్‌పురుషుని హృదయంలా ఉంది" అని. ఆ నిశ్చలస్థితిని గురుకరుణను ఆసరాగా తీసుకొని సాధించాలి. అదే జీవిత లక్ష్యం.

**– సాగిరాజు రామకృష్ణంరాజు,** అర్థవరం



ది॥ 04-05-06 తణుకు సజ్జాపురం
ఇన్‌కంటాక్స్ రోడ్‌లో
శ్రీ జానకి హాస్పటల్‌ను ప్రారంభించిన
డా॥ టి. రామబ్రహ్మంగారు.
ప్రక్కన
డా॥ ముదునూరి వెంకట సుబ్బరాజు, M.S.,
డా॥ ముదునూరి ఇందిర, M.B.B.S., DGO



కన్సల్టేషన్ రూంలో
డా॥ ముదునూరి
వెంకట సుబ్బరాజు,
M.S.,